## 27వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

సంకీర్తన యజ్ఞము నిర్వహించుట ద్వారా జనులు ఆర్థికముగా, రాజకీయంగా, ధార్మికముగా మరియు సాంస్కృతికముగా సంతోషిస్తారు.

యజ్ఞాన్ని నిర్వహించాలి... లేకుంటే జనులు పాప కార్యాలలో ఇరుక్కొని అత్యంత దుఃఖాన్ని అనుభవిస్తారు. అందుచేత కృష్ణచైతన్య ఉద్యమము ప్రపంచమంతా హరే కృష్ణ మంత్ర జపాన్ని ఆవిష్కరించే బాధ్యత తీసుకున్నది. ఈ హరే కృష్ణ ఉద్యమము కూడా ఒక యజ్ఞము కానీ దీనిలో గుణము కలిగిన బ్రాహ్మణులు మరియు అవసరమైన వస్తుసామగ్రిని సమకూర్చుకునే ఇబ్బందులేమీ లేవు. ఈ సామూహిక జపము ఎక్కడ పడితే అక్కడ నిర్వహిచుకొనవచ్చును. జనులు ఏదో విధంగా ఒక చోట చేరి మరియు వారిని "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే - హరే రామ హరే రామ రామ రామ హరే హరే" జపము చేయుటకు ఉత్సాహపరిస్తే యజ్ఞము యొక్క అన్ని ఉద్దేశాలు సంపూర్ణమగును. మొదటి ఉద్దేశము అవసరమైనంత వాన ఉండాలి. ఎందుచేతనంటే వాన లేకపోతే పంటలు ఉండవు (అన్నాద్ భవంతి భూతాని పర్జన్యాద్ అన్న సంభవహః). మన అవసరాల్లన్నీ కేవలం వాన ద్వారా ఉత్పత్తి అవును (కామాం వవర్ష పర్జన్యహః (శ్రీ. భా. - 1:10-4)), మరియు భూమి అన్ని అవసరాల యొక్క మూలము (సర్వ-కామ-దుఘ మహత్). సారాంసమేమిటంటే ఈ కలిగయుములో ప్రపంచమంతా జనులు పాప జీవితము యొక్క నాలుగు సూత్రాలు - పర స్త్రీ సంగమము, మాంసభక్షణము, తాగుడు మరియు జూదముల నుండి దూరంగా వుండి పవిత్రమైన స్థితిలో సులువైన యజ్ఞము హరే కృష్ణ మహామంత్ర జపము నిర్వహించాలి. అప్పడు భూమి తప్పక జీవితపు అవసరాలన్నీ ఉత్పత్తి చేస్తుంది. మరియు జనులు ఆర్థికముగా, రాజకీయంగా, ధార్మికముగా మరియు సాంస్కృతికముగా సంతోషిస్తారు. అంతా సరైన స్థితిలో ఉంటుంది.

***శ్రీ భా. 9:20-24-26***

## చర్చ - విషయ విభాగము

## ఆధ్యాత్మిక విద్య

పూజ్యనీయులు ఏ.సి. భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారిచే విరచితమైన “భగవద్గీత యథాతథము” నుండి సంగ్రహించబడినది.

*యో శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామకారతః*
*న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిం* భ.గీ. 16:23-24

శాస్త్రముల విధులను విడిచి తన యిష్టము వచ్చినట్లు ప్రవర్తించువాడు పరిపూర్ణతను గాని సౌఖ్యమును గాని, పరమగమ్యమును గాని పొందజాలడు.

ఇదివరకు వర్ణింపబడినట్లు మానవ సంఘమునందలి వివిధ వర్ణాశ్రమములకు ‘శాస్త్రవిధి’ చెప్పబడినది. ఈ నియమ నిబంధనలను ప్రతి వ్యక్తియు అనుసరింపవలయును. అతడు వీని ననుసరింపక తన కామలోభ వాంఛలననుసరించి యథేష్టముగా ప్రవర్తించినచో తన జీవితమున నెప్పడును సంపూర్ణుడు కాజాలడు. అతడు సిద్ధాంత పూర్వకముగా ఈ విషయముల నన్నిటి నెరుంగవచ్చును. కానీ జీవితమున వానిని సమన్వయింపక పోయినచో అతనిని నరాధముడుగా పరిగణింపవలెను. జీవితమునందలి మానవరూపమున జీవుడు తెలివిగలిగి అత్యున్నతస్థితికి తన జీవితమును పెంపొందించుటకు నొసంగబడిన నియమములనుసరింపవలయును. కాని అతడు వాని ననుసరింపనిచో తన్ను తానే అధమస్థితికి తెచ్చికొనును. ఈ నియమ నిబంధనలను నీతి సిద్ధాంతములను అనుసరించినప్పటికిని చివరికి పరంపురుషుని అవగాహనము చేసుకొను స్థితికి రానిచో అతని జ్ఞానమంతయు వ్యర్థమగును. అట్లే అతడు దేవుని యొక్క అస్థిత్వము నంగీకరించినప్పటికిని భగవంతుని భక్తియుక్త సేవలో నిమగ్నుడు కానిచో అతని ప్రయత్నములన్నియు వ్యర్థములగును. అందుచే మానవుడు క్రమముగా కృష్ణ చైతన్య స్థితికిని భక్తియుక్త సేవకును తన్నుద్ధరించుకొనవలయును. అప్పడే అత్యుత్తమ పరిపూర్ణ స్థితిని పొందజాలును.

‘కామకారతః’ అను పదము మిక్కిలి సార్ధకమైనది. తెలిసియుండి నియమములను ఉల్లంఘించువారు కామముతో పనిచేయును. ఇది నిషిద్ధమని యెరింగియు అతడట్లొనరించును. దీనికే యదేష్టాచరణమని పేరు. అది చేయవలెనని అతడెరుంగును. అయినను అతడు దానిని చేయడు. అందుచేతనే అతడు చంచలుడని చెప్పబడుచున్నాడు. అట్టి మానవులను పరం పురుషుడు పతితునిగా చేసి తీరును. మానవ జీవితమున కుద్దేశింపబడిన పరిపూర్ణత్వమును అట్టి మానవులు పొందజాలరు. మానవ జీవితము ముఖ్యముగా దానిని పవిత్రము చేసుకొనుటకే ఉద్దేశింపబడినది. నియమ నిబంధనలను అనుసరింపని వాడు తన్ను పవిత్రీకరించుకొనజాలడు. అట్లే యధార్థ సౌఖ్యస్థితిని గూడ పొందజాలడు.

*తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ*
*జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి*

అందుచే మానవుడు శాస్త్రములందలి నియమముల ద్వారా ఏది విధియో ఏది నిషిద్దమో తెలిసికొనవలయును. అట్టి నియమ నిబంధనల నెరిగి పనిచేసినచో అతడు క్రమముగా ఉద్ధరింపబడును.

పంచదశాధ్యాయమున పదిహేనవ శ్లోకమందు చెప్పబడినట్లు వేదములందలి నియమ నిబంధనలన్నియు కృష్ణుని తెలిసికొనుటకు ఉద్దేశింపబడినవి. మానవుడు భగవద్గీత వలన కృష్ణుని నర్థము చేసుకొని భక్తియుక్త సేవలో నిమగ్నుడగుచు కృష్ణ చైతన్య మందున్నచో అతడు వైదిక గ్రంథములందు చెప్పబడిన అత్యుత్తమ జ్ఞానపూర్ణత్వమును పొందినవాడగును. చైతన్య మహాప్రభువు ఈ విధానమును చాలా సులభము కావించెను. అతడు జనులను **'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే - హరే రామ హరే రామ రామ రామ హరే హరే' అను మంత్రమును మాత్రము జపించుచు భగవంతుని భక్తియుక్త సేవలో నిమగ్నమై దైవమునకు నివేదింపబడిన ఆహార పదార్థమూ శేషమూను తినవలెనని చెప్పియుండెను.** ఈ భక్తియుక్త వ్యాపారములలో ప్రత్యక్షముగా నిమగ్నుడైన వాడు వైదిక వాఙ్మయమునంతను చదివిన వాడనియే భావింపబడును. అట్టివాడు పరిపూర్ణమైన అవగాహనకు వచ్చినట్లే. కృష్ణ చైతన్యమునందు లేనట్టియు, భక్తియుక్త సేవలో నిమగ్నులు కానట్టియునగు సామాన్య జనులకు సంబంధించిన విధినిషేధములు వేద నిబందనలచే నిర్ణయింపబడును. హేతువాదము (తర్కము) లేకుండా ఎవ్వరైనను వానిననుసరించి పనిచేయవలయును. అదే శాస్త్ర సిద్ధాంతానుసరణము అనబడును. బద్ధజీవులయందు కనిపించు అపరిపక్వ భావములు, వంచన ప్రవృత్తి (విప్రలిప్స), నిశ్చయ దోషాచరణము (ప్రమాదము), నిశ్చయభ్రాంతి (భ్రమ) అను నాలుగు ముఖ్య దోషములను శాస్త్రమునందుండవు. బద్ధ జీవితమునందలి ఈ నాలుగు దోషములును మానవుని నియమ నిబంధనలను చేయుటయందు అనర్హునిగా చేయును. అందుచే ఈ శాస్త్రమునందు చెప్పబడి ఈ దోషముల కతీతమైన నియమ నిబంధనలు ఎట్టి మార్పును లేకుండా మహర్షుల చేతను, ఆచార్యుల చేతను, మహాత్ములచేతను అంగీకరింపబడును.

భారతదేశమున ఆధ్యాత్మికావగాహనమునందు సాధారణముగా నిరాకారవాదులు, సాకారవాదులు అని రెండు పక్షములు కలవు. ఈ రెండు పక్షముల వారును వేదసిద్ధాంతముల ననుసరించియే తమ జీవితములను గడుపుదురు. శాస్త్రముల సిద్ధాంతముల ననుసరింపకుండా ఎవ్వరును తమ్ము సంపూర్ణ స్థితికి ఉద్ధరించుకొనజాలరు. అందుచే నిజముగా శాస్త్రసారము అర్థము చేసుకొన్నవారు అదృష్టవంతులుగా పరిగణింపబడును.

మానవ సమాజమున దేవాదిదేవుని అవగాహనము చేసుకొను సిద్ధాంతముల యెడ పై వైముఖ్యము వహించుట పతనములకు కారణమగును. మానవ జీవితము నందలి గొప్ప అపరాధమిది. అందుచే దేవాదిదేవుని భౌతిక శక్తియైన 'మాయ' మూడు విధములైన దుఃఖముల రూపమున మనలనెప్పుడును బాధించుచున్నది. ఈ భౌతిక శక్తి భౌతిక ప్రకృతికి సంబంధించిన మూడు గుణములతో కూడినది. దేవదేవుని అవగాహనము చేసుకొను మార్గమున అడుగు పెట్టుటకు ముందు మానవుడు అధమము సాత్త్విక గుణమునకైనను తన్నుద్ధరించుకొనవలయును. సాత్త్విక గుణ ప్రమాణమునకు తన్నుద్ధరించుకొనక పోయినచో మానవుడు ఆసుర్జీవితమునకు కారణములైన అజ్ఞాన కామములందుండిపోవును. రజస్తమోగుణములలో నున్నవారు శాస్త్రములను, పవిత్ర వ్యక్తులను దేవాదిదేవుని సముచిత అవగాహనమును ద్వేషింతురు. వారు ఆధ్యాత్మికాచార్యుని బోధనలను నిరసించి శాస్త్రములందలి నియమ నిబంధనలను లెక్కపెట్టరు. భక్తియుక్త సేవయందలి వైభవములను విన్నను వారు వానిచే ఆకర్షింపబడరు. ఈ విధముగా వారు తమ సముద్ధరణ మార్గమును తామే కల్పించుకొందురు. అసుర జీవిత విధానమునకు దారిచూపు మానవ సమాజము నందలి కొన్ని లోపములులివియే. ఉన్నతస్థితియైన సముద్ధరణ మార్గమునకు మార్గదర్శకుడు కాగల తగిన ప్రామాణికాధ్యాత్మికాచార్యుని శిక్షణమునందున్నచో మానవుని జీవితము విజయవంతమగును.

**కనుగొనండి :**

1. వేదాలలో ఇచ్చిన నీతి నియమాలను పాటించే ఉద్దేశమేమిటి?
2. వాటిని అనుసరించకపోవుట వల్ల వచ్చే ఇబ్బంది ఏమిటి?
3. మనము శాస్త్రాలలోని నీతి నియమాలను మాత్రమే ఎందుకు ఒప్పుకోవాలి?
4. ఎప్పుడు ఒక వ్యక్తి మతిభ్రమించినట్లు ప్రవర్తించును?

**అవగాహన :**

1. ఆధ్యాత్మిక జీవితములో ఒకరు చేరుకోగల అత్యున్నత స్థితి ఏమిటి?
3. చైతన్య మహాప్రభు ఆ స్థితిని అతి సులభంగా పొందుట ఎలా అని చెప్పెను ?
4. ఎందుకు జనులు పరమ సత్యముయొక్క సరైన అవగాహన పొందుటలో విఫలులవుతారు?
4. రజస్తమో గుణాలలో ఉన్న జనులు ఎలా ప్రవర్తిస్తారు?
5. మనము భౌతిక జీవితములో ఎందుకు దుఃఖాలు అనుభవిస్తాము?

**అనువర్తనము :**

1. మీరు కృష్ణ చైతన్యములో అనుసరిస్తున్న ఏదో ఒక నియమం గురించి చెప్పండి మరియు అది మీ చైతన్యమును ఎలా పెంపొందించుకొనుటకు సహకరిస్తుందో వివరించండి.

## ప్రచారమే సర్వసారము

పూజ్యనీయులు ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు రచించిన "ప్రచారమే సారము" అను గ్రంథము నుండి సంగ్రహించడమైనది.

"దేవుని యొక్క ఉద్దేశాన్ని అర్థము చేసుకొని భక్తుడు ప్రచారము చేస్తాడు."

అజ్ఞానులైన వ్యక్తులు అల్పమైన భౌతిక భావనతో తాదాత్మ్యమునొంది భౌతిక కార్యములలో నిమగ్నులై ఉందురు మరియు అటుల వారు బంధింపబడుదురు. ఆధ్యాత్మిక జీవితము నందు వికాశము పొందినవారు అట్టి భౌతిక వ్యాపారమున నిమగ్నులైన వ్యక్తులను వారి అజ్ఞానము వల్ల వారు చేసే ఆ కార్యములు తక్కువ స్థాయిపైనను కలత పెట్టరాదు.

అజ్ఞానులు కృష్ణ చైతన్యయుక్తములైన కర్మలను అభినందింపజాలరు. అందుచేత భగవంతుడైన కృష్ణుడు అట్టి వారిని కలతపెట్టి విలువైన కాలమును వ్యర్థము చేయవలదని ఉపదేశించుచున్నాడు. భగవంతుని భక్తులు భగవంతుని కంటే కరుణామయులు, ఏలయన వారు భగవంతుని ప్రయోజనమును గ్రహింపజాలుదురు. కాబట్టి అజ్ఞానులను చేరి మానవుని ముఖ్యముగా అవసరమైన కృష్ణ చైతన్యయుక్త కార్యములయందు వారిని నిమగ్నులను కావింప యత్నించి, అన్ని విధములైన కష్టనష్టములను అనుభవించుటకు అంగీకరింతురు.

***భ.గీ. 3-29***